క్లుప్తంగా

అన్నదాతలకు నాణ్యమైన విద్యుత్


ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభిస్తున్న అంజిరెడ్డి

ముస్తాబాద్: అన్నదాతలకు నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నట్లు సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి అన్నారు. మండలంలోని నామాపూర్‌లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆదివారం ప్రారంభించి మాట్లాడారు. 24 గంటల త్రీఫేస్ కరెంట్‌ను అందించేందుకు పాలకవర్గం కృషి చేస్తోందన్నారు. లూజ్‌పోల్స్ విషయంలో ఇప్పటికే ప్రతిపాదించినట్లు తెలిపారు. ఎంపీపీ జనగామ శరత్‌రావు, జెడ్పీటీసీ గుండం నర్సయ్య, సర్పంచ్ విజయ, బీసీస్టడీ సర్కిల్ డైరెక్టర్ వెంకటస్వామి, ఎంపీటీసీ లలిత, ఉపసర్పంచ్ తిరుపతి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సురేందర్ రావు,తదితరులు పాల్గొన్నారు.

మజీద్ కమిటీ ఎన్నికలు నిర్వహించాలని ధర్నా


ధర్నా చేస్తున్న ముస్లింలు

సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రంలోని మజీద్ కమిటీ ఎన్నికల నిర్వహణలో జాప్యంపై ముస్లింలు ఆదివారం నిరసన తెలిపారు. మజీద్ కమిటీ సభ్యులు ధర్నా చేపట్టగా మాజీ చైర్మన్ ముస్తాఫా ఈ సందర్భంగా మాట్లాడారు. గత పాలకవర్గం గడువు ముగిసి చాలా రోజులైనా ఎన్నికలు నిర్వహించకపోవడంపై కమిటీ పెద్దలను ప్రశ్నించారు. షాదీఖానాకు మంత్రి కేటీఆర్ నిధులు మంజూరు చేసినా కమిటీ అనుమతి లేకుండా అదనంగా రూ.17 లక్షలు ఎందుకు ఖర్చు చేశారన్నారు. మజీద్ కమిటీ సభ్యుల నిర్ణయం ప్రకారం వెంటనే ఎన్నికలు నిర్వహించాలని కోరారు. ఆయనతో పాటు సుమారు 50 మంది ముస్లింలు పాల్గొన్నారు.

జాతర సక్సెస్ చేసినందుకు కృతజ్ఞతలు


ఈవోను సన్మానించిన సంఘం నాయకులు

వేములవాడ: రాజన్న మహాజాతరను సక్సెస్ చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేశారు ఈవో కృష్ణప్రసాద్. జాతర విజయవంతం కావడంతో ఆలయ ఉద్యోగులు సంఘం నాయకులు ఈవో దంపతులను ఆదివారం సన్మానించారు. పర్యవేక్షకులు తిరుపతిరావు, మహేశ్, నర్సయ్య, ఎడ్ల శివ, రవీందర్‌రెడ్డి, పీఆర్‌వో చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గెస్ట్‌హౌస్ ప్రారంభించేదెప్పుడో?


ప్రారంభానికి సిద్ధంగా ఉన్న గెస్ట్‌హౌస్

వేములవాడరూరల్: వేములవాడ బాలనగర్ ప్రాంతంలో నిర్మించిన ఎమ్మెల్యే గెస్ట్‌హౌస్ దాదాపు అన్ని హంగులతో పూర్తయింది. చాలా నియోజకవర్గాల్లో ఇప్పటికే ప్రారంభించినా, ఈ గెస్ట్‌హౌస్ ప్రారంభించేందుకు ఇంకా ముహూర్తం ఖరారు కాలేదా అని పలువురు చర్చించుకుంటున్నారు.

కనుల పండువగా కల్యాణం


కోనరావుపేట: మామిడిపల్లిలో కల్యాణాన్ని నిర్వహిస్తున్న అర్చకులు


ఇల్లంతకుంట: స్వామివారి కల్యాణానికి హాజరైన గ్రామస్తులు


ఎల్లారెడ్డిపేట: శివపార్వతుల ఊరేగింపు


బోయినపల్లి: శివపార్వతుల కల్యాణానికి హాజరైన ఎమ్మెల్యే రవిశంకర్

జిల్లాలో పలు శివాలయాల్లో శివపార్వతుల కల్యాణం ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఇల్లంతకుంట మండలంలోని అనంతగిరి రాజరాజేశ్వరస్వామి, చందుర్తి మండలం ఎన్గల్‌లోని శివాలయం, రుద్రంగి మండలం మానాల శ్రీ భవాని శంభులింగేశ్వర ఆలయం, ఎల్లారెడ్డిపేట మండలం అల్మాస్‌పూర్ గ్రామంలో మల్లికార్జునస్వామి ఆలయంలో మేడలమ్మ, కేతమ్మల కల్యాణం ఘనంగా నిర్వహించారు. బోయినపల్లి మండలంలోని విలాసాగర్, వెంకట్రావుపల్లి గ్రామాల్లో శివపార్వతుల కల్యాణానికి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు జోగినపల్లి రవీందర్‌రావు, జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, నెమళ్ల గుట్టపై మల్లికార్జునస్వామి కల్యాణోత్సవానికి టీఎస్‌పీటీడీసీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు జిందం చక్రపాణి హాజరయ్యారు. - సాక్షి నెట్‌వర్క్

జాతర సందడి

- ఆహ్లాదకరంగా ఉత్సవాలు
- మూడో రోజు ఆటవిడుపు
- జన సంద్రంగా పట్టణం

వేములవాడఅర్బన్: వేములవాడ రాజన్న సన్నిధిలో మూడు రోజుల జాతర ఆదివారంతో ముగిసింది. జాతరకు దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు శనివారం రాజన్నను దర్శించుకుని, ఆదివారం తీరుబడిగా గుడి చెరువు కట్ట వద్ద ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ చూసేందుకు కుటుంబ సభ్యులతో తరలివచ్చారు. రాజన్న గుడి వద్ద నుంచి చెరువు కట్ట జగిత్యాల బస్టాండ్ వరకు వివిధ రకాల బొమ్మల దుకాణాల వద్ద బొమ్మలు, చిన్నారులకు ఆట వస్తువులు కొనుగోలు చేసుకున్నారు. వారం రోజుల పాటు జరిగే ఈ జాతరకు వేలాదిగా తరలిరావడంతో సందడి నెలకొంది.


ఎగ్జిబిషన్ చూసేందుకు వచ్చిన జనం

కుటుంబంతోనే వస్తాం


మహాశివరాత్రి రోజు జాగరణ ఉన్నందున ఇంట్లోనే జాగరణ పూజలు చేస్తాం. అనంతరం ఆదివారం రోజు అక్క, చెల్లెలు, బావలు, అమ్మనాన్న, మా పిల్లలు కుటుంబ సభ్యులతో అందరం కలిసి జాతరకు వచ్చాం.

- శ్రీకాంత్, రుద్రవరం

జాతరకు వచ్చాం


వేములవాడలో మహాశివరాత్రికి రాజన్న ఆలయంలో ఘనంగా జరుగుతుంది. అందుకని మా అత్తగారు ఇంటికి రుద్రవరం వచ్చాం. అందరితో కలిసి జాతర చూసేందుకు ఈ రోజు వచ్చాం. చాలా సంతోషంగా ఉంది.

- సతీశ్. కరీంనగర్

అంతా ఇక్కడి వారు ఉంటారు


మహాశివరాత్రి మరుసటి రోజు జాతరకు వస్తే అందరూ పట్టణ, గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఉంటారు. మనకు తెలిసిన వారందరూ ఉంటారు. కాబట్టి వారితో కలిసి ఇక్కడ ఉన్న సర్కస్‌లను చూపించుకోని వెళ్తాం.

- శ్రీనివాస్. తిప్పాపూర్

ప్రతి సంవత్సరం ఇలానే వస్తాం


శివరాత్రి తెల్లారి ఇక్కడి వస్తాం. ఎందుకంటే శివరాత్రి రోజు వివిధ ప్రాంతాల జనాలతో రద్దీగా ఉంటుంది. ఇప్పుడైతే ప్రశాంతంగా జాతర చూసి వెళ్తాం.

- సాయి. వేములవాడ


గంభీరావుపేట: ముచ్చర్లలో శోభాయాత్రలో పాల్గొన్న యువకులు

ఛత్రపతికి నివాళి

చత్రపతి శివాజీ జయంతి వేడుకలను జిల్లాలోని అన్ని గ్రామాల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. శివాజీ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అలాగే శివాజీ చిత్రపటాలను యువకులు డప్పు చప్పుళ్ల మధ్య శోభాయాత్ర నిర్వహించారు. - సాక్షి నెట్‌వర్క్


వేములవాడఅర్బన్: వేములవాడలో జయంతి వేడుకలు


వేములవాడరూరల్: జయవరంలో..

'మల్లన్నసాగర్ జలాలతో సస్యశ్యామలం'

ముస్తాబాద్: మల్లన్నసాగర్ జలాలతో ముస్తాబాద్ మెట్టప్రాంతం సస్యశ్యామలం అవుతోందని ఎంపీపీ జనగామ శరత్‌రావు అన్నారు. స్థానిక బీఆర్ఎస్ కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడారు. మండలానికి మరో రెండు రోజుల్లో మల్లన్నసాగర్ ప్యాకేజీ 12 ద్వారా నీటిని విడుదల చేస్తున్నారన్నారు. దుబ్బాక మీదుగా మోహినికుంట, మద్దికుంట, చీకోడు గ్రామాల నుంచి గూడెం, నామాపూర్, చిప్పలపల్లి, కొండాపూర్, ఆవునూర్, తెర్లుమద్ది వరకు గోదావరి జలాలు వస్తున్నాయన్నారు. యాసంగి పంటలకు, వేసవిలో తాగునీటికి ఇబ్బందులు ఉండబోవన్నారు. ఇప్పటికే కొండపోచమ్మ కెనాల్ ద్వారా కూడవెల్లి వాగులోకి గోదావరి జలాలు రావడంతో ఎగువ మానేరు ప్రాజెక్టు నిండుకుండలా మారిందన్నారు. కేసీఆర్‌కు ఈ ప్రాంత రైతాంగం రుణపడి ఉంటుందన్నారు. జెడ్పీటీసీ నర్సయ్య, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, సర్పంచ్ సుమతి, రజక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అక్కరాజు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీపీ శరత్‌రావు, తదితరులు

చిన్నలింగాపూర్‌లో నీటి కటకట

తంగళ్లపల్లి: మండలంలోని చిన్నలింగాపూర్ గ్రామపరిధిలో గ్రామానికి నీటి సరఫరా చేసే మిషన్ భగీరథ నీటి పైప్‌లైన్ పగిలి వారం రోజులుగా నీటి సరఫరా నిలిచిపోయిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వెంటనే మిషన్ భగీరథ అధికారులు స్పందించి పైప్‌లైన్‌కు మరమ్మతులు చేసి నీటి సరఫరాలను పునరుద్ధరించాలని కోరుతున్నారు. అప్పటి వరకు గ్రామపంచాయతీ ద్వారా వాటర్ ట్యాంకర్లు ఏర్పాటు చేసి నీటిని అందించాలని కోరారు..

ఆలయ పనుల పరిశీలన

కోనరావుపేట: మండలం మల్కపేటలో సొంత ఖర్చులతో నిర్మిస్తున్న ఆలయ పనులను ఆదివారం చల్మెడ ఆస్పత్రి చైర్మన్ లక్ష్మీనర్సింహారావు, కరీంనగర్ డెయిరీ చైర్మన్ చల్మెడ రాజేశ్వర్‌రావు పరిశీలించారు. ఎంపీపీ చంద్రయ్య గౌడ్, సర్పంచ్ లత పాల్గొన్నారు.

మల్లేశ్‌కు మెరుగైన వైద్యం అందించాలి

ఎల్లారెడ్డిపేట: మండలంలోని వెంకటాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ యూత్ నాయకులు మేడిశెట్టి మల్లేశ్‌కు మెరుగైన వైద్యం అందించాలని మంత్రి కేటీఆర్ డాక్టర్‌కు ఫోన్ చేసి తెలిపారు. వారం రోజులుగా ఆయన అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నాడు.

స్నేహితుడి కుటుంబానికి అండగా..

గంభీరావుపేట: మండలంలోని గోరింటాల గ్రామానికి చెందిన మూల అంజిరెడ్డి ఇటీవల మృతి చెందాడు. అతని స్నేహితులు (1996–97 ఎస్సెస్సీ బ్యాచ్)రూ. 15వేల ఆర్థిక సాయాన్ని కుటుంబానికి ఆదివారం అందజేశారు. ఆయన కుటుంబసభ్యులకు మనోధైర్యాన్ని కల్పించారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలో ఆదివారం పలువురు లబ్ధిదారులకు సెస్ డైరెక్టర్ వరుస కృష్ణహరి, బీఆర్ఎస్ పట్టణశాఖ అధ్యక్షుడు బండారి బాల్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు గుండారపు కృష్ణారెడ్డి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు.



ఆత్మీయ సమ్మేళనం

చందుర్తి: స్థానిక జెడ్పీహెచ్ఎస్‌లో 1997–98 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఎక్కడెక్కడో వివిధ స్థాయిల్లో స్థిరపడ్డ పూర్వ విద్యార్థులు కుటుంబ సమేతంగా హాజరయ్యారు. పాతికేళ్ల నాటి విద్యార్థి అనుభవాలను గురువుల సమక్షంలో పంచుకున్నారు. విద్యార్థి దశలోని తీపి జ్ఞాపకాలను పంచుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు.



శరవేగంగా రోడ్డు పనులు

ఇల్లంతకుంట: మండలంలోని రహీంఖాన్‌పేట రహీంఖాన్‌పేట గ్రామ శివారులో మోడల్ స్కూల్ నిర్మించి పదేళ్లు అయినా సీసీ రోడ్డు నిర్మించకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు. ఈ విషయాన్ని పలుమార్లు ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ దృష్టికి తీసుకెళ్లగా ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించారు. సుమారు 8 వందల మీటర్ల ఈ రోడ్డుకిరువైపులా వ్యవసాయ భూములు ఉండటంతో రోడ్డు వెడల్పు చేసేందుకు రైతులు ససేమిరా అనడంతో ఎమ్మెల్యే ఆదేశాల మేరకు జెడ్పీ వైస్‌చైర్మన్ సిద్ధం వేణు రంగప్రవేశం చేసి వారితో మాట్లాడి, నిర్మాణానికి అడ్డంకులను తొలగించారు. వారం రోజులుగా పనులు సాగుతున్నాయి.

భక్తులకు పండ్లు పంపిణీ

వేములవాడ: వేములవాడ రాజన్న మహా జాతర సందర్భంగా భక్తులకు మై వేములవాడ ట్రస్టు ప్రతినిధులు ఆదివారం అరటిపండ్లు పంపిణీ చేశారు. రాజన్న గుడితోపాటు బద్దిపోచమ్మ, భీమేశ్వరాలయం, కోడెల క్యూలైన్ల వద్ద భక్తులకు అరటి పండ్లు అందజేశారు. వీటితోపాటు శుద్ధజలం అందజేశారు. కార్యక్రమంలో మధు మహేశ్, కొప్పుల హన్మండ్లు, పాలాస రాజేందర్, ప్రతాప నటరాజ్, రఫీక్, తోట రాజు, చల్లా సత్తయ్య పాల్గొన్నారు.

మద్యం పట్టివేత

వేములవాడఅర్బన్: రాజన్న ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా వేములవాడ జాతర గ్రౌండ్ ప్రాంతంలో అక్రమంగా మద్యం అమ్ముతున్నట్లు సమాచారంతో ఎక్సైజ్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. దాంతో శుక్రవారం, శనివారం, ఆదివారల్లో మూడు రోజుల్లో రూ. 25 వేల మద్యం పట్టుబడినట్లు వేములవాడ ఎక్సైజ్ సీఐ రాము తెలిపారు.

వైస్‌ఎంపీపీ కుటుంబానికి ఆర్థికసాయం


ఆర్థిక సాయం అందిస్తున్న మిత్ర బృందం

ఎల్లారెడ్డిపేట: వీర్నపల్లి మండలం గర్జనపల్లికి చెందిన మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు హేమ భర్త దేవేందర్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. దేవేందర్ స్నేహితులందరూ కలిసి ఆ కుటుంబానికి ఆదివారం రూ. 40 వేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ రజిత, నాయకులు పాల్గొన్నారు.

పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలి

- ప్రజాసంఘాల నాయకుల డిమాండ్

వీర్నపల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో అర్హులైన నిరుపేద ప్రజలకు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం పలు గ్రామాల్లో పూరి గుడిసెల్లో జీవనం సాగిస్తున్న కుటుంబాలతో వారు మాట్లాడి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకుడు మల్లారపు అరుణ్ కుమార్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చాలని అన్నారు. మండల వ్యాప్తంగా పేదలకు ఇళ్ల స్థలాలు, డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వలేదన్నారు. మండలం ఏర్పాటై ఆరేళ్లయిందని, మండల విభజనలో భాగంగా మండలానికి 160 ఇళ్లు మాత్రమే కేటాయించారని, అన్ని గ్రామాల్లో అర్హులైన కుటుంబాలకు అందడం లేదని అన్నారు. మండల వ్యాప్తంగా వేల సంఖ్యలో పూరి గుడిసె కుటుంబాలు జీవిస్తున్నాయని అన్నారు. కానీ ప్రభుత్వం గ్రామాల్లో పదుల సంఖ్యలో ఇవ్వడం ద్వారా మిగతా ఇల్లు లేని పేదలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. సిరిసిల్ల నియోజకవర్గంలో తక్కువ డబుల్ బెడ్రూంలు కేటాయించిన మండలం వీర్నపల్లి అని అన్నారు. అర్హులైన పేదలకు ఇళ్లు కేటాయించే వరకు పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఈ నెల 21న తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని అన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గుంటుకు నరేందర్, కార్మిక ప్రజా సంఘాల నాయకులు రాజేల్లయ్య, దేవరాజు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి జంగం అంజయ్య, శంకర్, మల్లయ్య, దేవయ్య పాల్గొన్నారు.


కుటుంబంతో మాట్లాడుతున్న నాయకులు

కేసీఆర్ ఆదేశిస్తే ఎన్నికల్లో పోటీ

కోనరావుపేట: సీఎం కేసీఆర్ ఆదేశిస్తే ఎన్నికల్లో తాను పోటీ చేసేందుకు సిద్ధమని చల్మెడ ఆస్పత్రి చైర్మన్ చల్మెడ లక్ష్మీనర్సింహరావు అన్నారు. మల్కపేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ గ్రామంలోని యువకులు, ప్రజలు ఐక్యమత్యంగా ఉండాలని, అప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. తాము మెడికల్ కాలేజీ ఏర్పాటు చేసినప్పటి నుంచే వైద్య శిబిరాలు, నిరుపేదలకు వైద్య చికిత్సలు అందిస్తున్నామన్నారు.


మాట్లాడుతున్న లక్ష్మీనర్సింహరావు